నేడు సేవ్ ది గర్ల్, చైల్డ్ సదస్సు

ఎంఎల్ఎ నిమ్మల ఆధ్వర్యాన విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆడపిల్లల రక్షణకు పాలకొల్లులో ఆదివారం నిర్వహించే సేవ్ ది గర్ల్, చైల్డ్ సదస్సును విజయవంతం చేయాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విద్యార్థులను కోరారు. శనివారం ఆయన బ్రాడీపేట ఎవిఎస్ హైస్కూల్, భాష్యం, నారాయణతోపాటు పలు స్కూళ్లు, కళాశాలలను సందర్శించి సదస్సు ఆవశ్యకత వివరించారు. ఆడపిల్లలను, శిశువులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల

భీమవరం రూరల్‌లో..

పెనుమంట్రలో..

నియామకాల్లో రాజకీయ జోక్యం నివారించాలి

ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆశా కార్యకర్తల నియామకాల్లో రాజకీయ జోక్యం నివారించాలని, రిటైరైన, మృతి చెందిన కార్యకర్తల కుటుంబాల్లో అర్హులకు అవకాశం కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు లారెన్స్‌కుమారి డిమాండ్ చేశారు. మండలంలో గొల్లవానితిప్ప పిహెచ్‌సి వద్ద శనివారం యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి వైద్యాధికారి డాక్టర్ పి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లారెన్స్‌కుమారి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు సేవలందిస్తున్న ఆశాలకు సంక్షేమ పథకాల తొలగింపు దారుణమన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా చేయడం దారుణమన్నారు. ఆశాల నియామకాల్లో రాజకీయ జోక్యం లేకుండా ప్రభుత్వం చూడాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, నేతలు కె.వెంకటరమణ, జ్యోతి, కోటేశ్వరి, ఎం.విజయకుమారి పాల్గొన్నారు.

పెనుమంట్ర: ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ ఆధ్వర్యాన మార్టేరు పిహెచ్‌సిలో డాక్టర్ సమీర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి పరిధిలో ఆశా వర్కర్లు పి.రత్నకుమారి, పార్వతి, సీత, లక్ష్మిదుర్గ పాల్గొన్నారు.

కళాకృతుల తయారీ, ప్రదర్శన అభినందనీయం

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఇంత మంచి కళాకృతులను తయారు చేసి ప్రదర్శించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం పట్టణంలో చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టిఎల్ఎం ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్ పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన సుమారు 600 వివిధ రకాల కళాకృతులను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరెన్నో కళాకృతులను విద్యార్థులచే తయారు చేయించాలని సూచించారు. విభిన్నమైన కళాకృతులు కలెక్టర్‌ను ప్రత్యేకంగా ఆకర్షించాయి. కాగితాలతో తయారుచేసిన డైనోసార్, ప్లాస్టిక్ లేకుండా తయారు చేసిన వివిధ రకాల పువ్వులు, దారాలతో చేసిన బొమ్మలు, ఇంట్లో వినియోగించే గృహోపకరణాలు ఆకర్షణీయంగా నిలిచాయి. కలెక్టర్ ప్రశాంతి కుటుంబ సభ్యుల చిత్రపటాన్ని పాలకోడేరుకు చెందిన కె.అంబిక చిత్రించి కలెక్టర్‌కు బహుకరించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యామసుందర్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్

నాలుగు నెలలైనా సమస్య పరిష్కరించలేరా? : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలోని ఐదో వార్డులో రైల్వే జంక్షన్ స్టేషన్‌కు వెళ్లే మార్గంలో వంతెన కింద మున్సిపల్ కుళాయి పాడై సుమారు నాలుగు నెలలైనా ఇంతవరకూ అధికారులు పరిష్కరించకపోవడం శోచనీయమని సిపిఎం పట్టణ నాయకులు వైకుంఠరావు అన్నారు. శనివారం ఆ ప్రాంతాన్ని సిపిఎం బృందం పరిశీలించి స్థానికులతో మాట్లాడింది. అనేకసార్లు స్థానికులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కరించలేదని వైకుంఠరావు చెప్పారు. ఉదయం తాగునీరు సరఫరా సమయంలో గుంట నిండిపోయి రోడ్డుపైకి నీరొస్తుందని, అక్కడే చెత్త ఉండటం వల్ల తాగునీటిలో వ్యర్థాలు కలిసి నీరు కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, అన్నం రాంబాబు, స్థానికులు ఎ.రాంబాబు, జె.బాబూరావు, పి.రాము, ఎవి.రమణ, బి.కొండనాయక్ పాల్గొన్నారు.

గుంతను పరిశీలిస్తున్న నేతలు

కమ్యూనిస్టు నేత కొత్తలంక రామబ్రహ్మం ఆదర్శనీయుడు

సంస్మరణ సభలో ఎంఎల్‌సి అంగర

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

కమ్యూనిస్టు నేత కొత్తలంక రామబ్రహ్మం ఆదర్శనీయుడని ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు అన్నారు. రాజకీయాలు ఏమైనా గ్రామం మంచి వ్యక్తిని కోల్పోయిందన్నారు. మండలంలోని కాపవరంలో రామబ్రహ్మం సంస్మరణ సభ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన శనివారం జరిగింది. మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ రామబ్రహ్మం పేదల సమస్యలపై నిర్విరామంగా పని చేసి సిపిఎం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పార్టీపై నిర్బంధ కాలంలో కొరియర్‌గా పని చేశారని కొనియాడారు. తొమ్మిది పదుల వయస్సులోనూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ కమ్యూనిస్టులు నిరాడంబర జీవితం గడుపుతారన్నారు. ఎప్పుడూ జనంతో మమేకమై ఉంటూ సమస్యలపై పోరాడతారన్నారు. తొలుత రామబ్రహ్మం చిత్రపటానికి వలవల శ్రీరామ్మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సభలో సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, ఐద్వా నాయకులు జయప్రభ, కె.సత్తిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిహెచ్.సోమేశ్వరరావు, ఏలూరు సీత, పురుషోత్తం, అజయకుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి అంగర రామ్మోహన్

మాట్లాడుతున్న దాసి రాజు

రీసర్వేకు ప్రతిఒక్కరూ సహకరించండి : డిఆర్ఒ దాసి రాజు

ప్రజాశక్తి - ఆకివీడు

గ్రామాల్లో భూముల రీసర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు కోరారు. శనివారం రాత్రి స్థానిక రైతులతో సచివాలయ భవనంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ స్థలాలు, పొలాల్లో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తారన్నారు. స్వామిత్వ విధానంలో పంట పొలాలతో ఇంటి స్థలాలను నిర్ధారిస్తారన్నారు. గ్రామంలోని అన్ని రకాల పోరంబోకులు, సొంత స్థలాలతోపాటు గ్రామకంఠం స్థలాలను సైతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

ఈ విధానం ద్వారా సర్వే రికార్డులు పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి గాలి సామ్రాజ్యం, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఉప్పుటేరు శివారు ప్రాంతంలో భూమి ఆక్రమణకు గురవుతోందని స్పందనలో వచ్చిన సమస్యకు సంబంధించి చేపల చెరువును ఆయన పరిశీలించారు.

మైనార్టీల అభివృద్ధికి వక్ఫ్‌బోర్డు కృషి చేయాలి

నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి వక్ఫ్ బోర్డు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కోరారు. వక్ఫ్ బోర్డ్ నూతన పాలకవర్గం శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో ప్రమాణ స్వీకారం చేసింది. జిల్లా అధ్యక్షులుగా ఎమ్‌డి.కరీముల్లాభాషా, కార్యదర్శిగా ఎమ్‌డి.సిద్ధిఖ్, ఉపాధ్యక్షులుగా షేక్ ఎమ్‌డి షాపిహుర్ రెహ్మాన్, సభ్యులుగా షేక్ సుభాని, అబ్దుల్ హై, ఎమ్‌డి అబ్దుల్ రహీమ్, ఎమ్‌డి అజహర్ ఖురేషి, షేక్ అమీర్‌భాషా, చాన్‌భాషా, ఖజావలి, ఎమ్‌డి.ఖాజా మొహిద్దీన్ సిరాజ్ ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించారన్నారు. నూతన పాలకవర్గం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అర్హులందరికీ అందేటట్లు చూడాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులతో పాటు ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, జాతీయ బిసి సంఘాల జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్, భీమవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారాయణరాజు పాల్గొన్నారు. అనంతరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను నూతన పాలకవర్గం ఘనంగా సత్కరించింది.



నేతలను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

భార్య మృతి, చికిత్స పొందుతున్న భర్త

ప్రజాశక్తి - యలమంచిలి

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని శిరగాలపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శిరగాలపల్లికి చెందిన యశోద తన కుమారుడు కృష్ణతో కలిసి కోడలి బంధువుల పెళ్లి నిమిత్తం మూడు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి శుక్రవారం ఉదయం తిరిగి వచ్చారు. శనివారం తెల్లవారుజామున మేల్కొన్న కృష్ణ బయటకు రాగా ఇంటి ఆవరణలో ఖాళీగా పడి ఉన్న పురుగుల మందు డబ్బా కనిపించింది. అనుమానంతో కృష్ణ తల్లిదండ్రుల గది కిటికీలోంచి చూడగా తల్లి యశోద పడుకొని ఉండగా తండ్రి సత్యనారాయణ వాంతులు చేసుకుంటూ కనిపించాడు. కంగారు పడిన కృష్ణ తలుపులను గట్టిగా మోదగా తండ్రి సత్యనారాయణ తలుపులు తెరిచి అక్కడే కుప్పకూలిపోయాడు. అప్పటికే తల్లి యశోద మృతి చెందింది. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని పాలకొల్లులోని ఒక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. వ్యవసాయంలో నష్టాలు వచ్చి ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో దంపతులిద్దరూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండవచ్చని బంధువులు భావిస్తున్నారు. సత్యనారాయణ పూర్తిగా కోలుకుంటే గాని కారణాలను చెప్పలేమని యలమంచిలి ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. యశోద మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు తరలించారు. సత్యనారాయణను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు బంధువులు తెలిపారు.

మరమ్మతులు నిర్వహిస్తున్న రైల్వే సిబ్బంది

రైల్వేట్రాక్ మరమ్మతులతో గేటు మూత

జనం అవస్థలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో శృంగవృక్షం రైల్వేగేటు మూసివేత కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వేట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 17 నుంచి 19వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకూ రైల్వేగేటును మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. రైల్వే గేటు మూసివేతతో నిత్యం పాఠశాలలు, కళాశాలలు, వివిధ పనుల నిమిత్తం భీమవరం వైపు వెళ్లే విద్యార్థులు, ప్రజలు, వ్యాపారులు ఇబ్బందిపడ్డారు. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనచోదకులు నందమూరుగరువు, పెర్కిపాలెం రైల్వే గేట్లు మీదుగా శృంగవృక్షం వెళ్లి అక్కడ నుంచి భీమవరం ప్రయాణాలు సాగించారు. గేటు మూసివేసిన విషయం తెలియని కొందరు గేటు వరకూ వచ్చి అక్కడ ఉన్న ఆటోలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

చిత్తశుద్ధితో పని చేయాలి

సచివాలయ సిబ్బందితో కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం తాడేరు సచివాలయంలో వివిధ కార్యక్రమాలపై సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కౌన్సెలింగ్ ద్వారా ఎంత మందిని గుర్తించారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది గర్భిణులను గుర్తించారు, వారికి పోషకాహారం అందిస్తున్నారా.. లేదా తదితర వివరాలను సమీక్షించారు. సచివాలయం నుంచి కుల, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాలు ఎన్ని జారీ చేశారు, వాటి కోసం ఇంకా ఎన్ని దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, తహశీల్దార్ వై.రవికుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్ఎస్.రామచంద్రప్రభు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కదులుతున్న నేతలు పీఠాలు



సాధారణ ఎన్నికల వేడి నేతల్లో మొదలైంది. ఆయా పార్టీల అధినేతల హడావుడితో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అధికార, ప్రతిపక్ష నేతలు అటు అధినేతల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించడంతోపాటు ఇటు ప్రజాక్షేత్రంలోకి కదులుతున్నారు. సేవా కార్యక్రమాల పేరిట ఇప్పటి నుంచే ఇబ్బంది లేకుండా అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు సిట్టింగులు, మరికొందరు ఇన్‌ఛార్జులు తమ పీఠాలు కదలకుండా జాగ్రత్త పడుతున్నారు. మొత్తంగా సాధారణ ఎన్నికలకు ఇంకా 15 నెలల వరకూ సమయం ఉన్నా నేతలకు ఎన్నికల ఫీవర్ ప్రారంభమైందని చెప్పొచ్చు.

సిఎం జగన్ గత నెలలో పశ్చిమలోని నరసాపురం వచ్చి వెళ్లారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు దెందులూరు, చింతలపూడి, పోలవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పర్యటించారు. దీంతో జిల్లాలోని అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీల ముఖ్య నేతల్లో ఒక్కసారిగా సాధారణ ఎన్నికల వేడి రగులుకుంది.

ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ తీరు ఆధారంగానే టిక్కెట్ల కేటాయింపు ఉంటుందని సిఎం జగన్ ప్రకటించడంతో వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎలతోపాటు ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల్లోనూ కలవరం మొదలైంది. అదే సమయంలో జంపింగ్ జిలానీలపైనా విస్తృత చర్చ సాగుతోంది. ప్రధానంగా గ్రూపు విబేధాలు తారాస్థాయికి చేరుకున్న నియోజకవర్గాల్లో సిట్టింగుల్లోనూ ఒకింత ఆందోళన నెలకొంది. ముఖ్యంగా చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్ఎ, ఎంపీలు రెండు గ్రూపులుగా విడిపోయిన సంగతి అందరికీ తెలిసిందే. ప్రతి అంశంలోనూ విపక్షం కన్నా స్వపక్షంలోనే విమర్శ ప్రతివిమర్శలకు దిగుతున్న పరిస్థితి ఈ నియోజకవర్గ అధికారపక్షంలో నెలకొంది. దీంతో గతంలో అధికారపక్షమైన టిడిపి ఇక్కడ ఎదుర్కొన్న పరిస్థితే ప్రస్తుత అధికారపక్షమైన వైసిపిలో నెలకొందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలో ఇక్కడ టిడిపి ఎంఎల్ఎగా గెలుపొందిన పీతల సుజాత మంత్రి పదవి దక్కించుకున్నా మధ్యలోనే ఆ పదవి కోల్పోవడంతోపాటు గత ఎన్నికల్లో టిక్కెట్ కూడా దక్కించుకోలేకపోయారు. అదే చరిత్ర వైసిపిలోనూ రానున్న ఎన్నికల్లో పునరావృతమవుతుందా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

ఇక ఏలూరు నియోజకవర్గంలో నగరపాలక సంస్థ వ్యవహారం అక్కడ మాజీ డిప్యూటీ సిఎం, ఎంఎల్ఎ ఆళ్ల నానికి తలనొప్పులు తెచ్చిపెడుతుందని చెప్పొచ్చు. కమిషనర్ వ్యవహారం, కార్పొరేటర్లే విపక్షంగా మారడం, గతంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ అవినీతి వ్యవహారం పంటి కింద రాయిలా మారాయని చెప్పొచ్చు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రస్తుతం ఆ నియోజకవర్గంపైనే ప్రధానంగా దృష్టిసారించి ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతానికి అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు పైకి కన్పిస్తున్నా ఎన్నికల సమయానికి ఇక్కడ పోటీదారులు తెరపైకి వచ్చే అవకాశం ఉందని పరిశీలకుల అంచనా. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రస్తుతానికి సిట్టింగులకు అంతగా ఇబ్బంది లేనట్లు ఒక అంచనా. అదే సమయంలో ప్రతిపక్ష టిడిపి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లులో నిమ్మల రామానాయుడు ఎలాంటి ఇబ్బందీ లేకుండా తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ప్రతి అంశాలోనూ జోక్యం చేసుకుంటూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంలో ముందుంటున్నారు.

ఉండి నియోజకవర్గానికి వచ్చేసరికి పరిస్థితి వేరేలా ఉంది. ఇక్కడ అధికారపక్షం వైసిపి తరహాలోనే టిడిపి కూడా అంతర్గత విబేధాలతో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించడంతోపాటు ఇక నుంచి తాను సేవా కార్యక్రమాలు పెంచడంతోపాటు పార్టీలోనూ క్రియాశీలకంగా ఉంటానని ప్రకటించడం దేనికి సంకేతమో అని అంతా మల్లగుల్లాలుపడుతున్నారు. శివకు వరుసకు సోదరుడైన మంతెన రామరాజు ప్రస్తుతం ఉండి ఎంఎల్ఎగా ఉన్నారు. మరి ఈసారి శివకు ఉండి టిక్కెట్ కోరుకుంటారా అనే చర్చ మొదలైంది. అదే సమయంలో ఆయన భీమవరం టిక్కెట్ కోరుకుంటున్నట్లు ప్రచారమూ ఉంది. ఒకవేళ ఎంఎల్ఎ టిక్కెట్ ఇవ్వకపోతే శివ వైసిపి వైపు చూసే అవకాశం ఉందని, ఇప్పటికే వైసిపి అధిష్టానం కూడా ఆ ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఆ నియోజకవర్గ పరిధిలోని గ్రామానికి చెందిన మాజీ మంత్రి తన కుమారునికి ఈ సీటు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఇరుపక్షాల్లోనూ టిక్కెట్ కోసం పోటీ పెరగ్గా శివ మళ్లీ క్రియాశీలకంగా తెరపైకి రావడం హాట్ టాపిక్‌గా మారింది.

ఏదేమైనా సాధారణ ఎన్నికలకు సుమారు సంవత్సరం ముందే ఆశావహులకు ఎన్నికల జ్వరం సోకిందని ఈ పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. అయితే ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో వేచిచూడాలి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

క్రీడాకారులకు వసతి సౌకర్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు వచ్చే ప్లేయర్స్‌కి వసతి సౌకర్యం కల్పించాలని సదుద్దేశంతో భవనం నిర్మించినట్లు ఖండవల్లి కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్, ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ సత్తి సుబ్బారెడ్డి చెప్పారు. మార్టేరు పెద్ద వీధిలో ఖండవల్లి కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్ నూతన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపించి రెండేళ్లు అవుతుందని, మొదటి సంవత్సరం ఈ ట్రస్ట్ ద్వారా అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కరోనా సమయంలో జగ్గయ్యపేట, మార్టేరు గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు రుచికరంగా వండుతున్నారని ఐద్వా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు కేత పద్మజ అన్నారు. పోలమూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన శనివారం రుచి చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - ఉండి

వృద్ధులకు అన్నదానం చేస్తున్న రాజేష్‌వర్మ

కోలమూరు గ్రామ అధ్యక్షులు గండ్రాజు రాజేష్‌వర్మ కుమార్తె జశ్విత వర్మ రెండో పుట్టినరోజు సందర్భంగా భీమవరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అమ్మమ్మ తాతయ్య మంతెన రామకృష్ణంరాజు రామసీత జ్ఞాపకార్థం తబిత వృద్ధాశ్రమం నిర్వహించినట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ వృద్ధులకు చేయూతనివ్వాలని ఆయన కోరారు.

కారాగారంలో జైల్ అదాలత్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సోని స్థానిక ప్రత్యేక కారాగారాన్ని శనివారం తనిఖీ చేసి జైల్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిమాండ్‌లో ఉన్న ఖైదీలు జీవితంలో ఎన్నడూ మళ్లీ జైల్ లావణ్యకు రాకూడదని ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు. ఆవేశంలో, వేరువిధ తప్పిదాలకు నేరాలకు పాల్పడి మానసికంగా కుంగిపోకూడదని ప్రవర్తన చెందాలన్నారు. ప్యానల్ లాయర్స్ పి.అంబేద్కర్, ఎం.అబ్బాయితాత, జైల్ పర్యవేక్షణాధికారి వెంకటగిరి, పిఎల్‌వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితుల సమస్యలపై ఐక్య పోరాటం

ఉండి : దళితుల సమస్యలపై సమిష్టిగా పోరాడదామని మాల మహానాడు ఉండి మండల అధ్యక్షులు చిగురుపాటి రాజేష్ కోరారు. శనివారం మండలంలోని వెలివర్రు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి లర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ పిలుపుమేరకు దళితులంతా సంఘటితమై సమస్యలపై పోరాడాలన్నారు. ప్రభుత్వాలు మారిన దళితుల సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. రానున్న రోజుల్లో దళితులంతా ఐకమత్యంగా కలిసి రాజ్యాధికారం దిశగా పయనించాలని రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వై.దావీదు, జి.సునీల్, పి.యేసయ్య, జి.మధు, పి.రాకేష్, వై.ప్రవీణ్, ఆర్.అభిషేక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి - ఆచంట

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు అందించి పేదల సొంతింటి కలను సహకారం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. వల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అర్హులందరికీ ఇల్లు నిర్మించేందుకు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జగన్నాధరావు, హౌసింగ్ ఎఇ నరేష్, పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు


విరాళం అందిస్తున్న దాతలు

పాలకొల్లు శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి నిత్యాన్న దాన ట్రస్టుకు ప్రముఖ వ్యాపార వేత్త నడపన జగపతి, పార్వతి దంపతులు రూ.50 వేల శాశ్వత విరాళం శనివారం అందించారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణలకు రూ.50 వేల చెక్కు అందించారు. జగపతి, పార్వతి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడు సాయిముకేష్, మమతల వివాహ వార్షికోత్సవం, రెండో కుమారుడు భరత్, హారికల వివాహం సందర్భంగా ఈ విరాళం అందించారు. దంపతులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం అందించారు.

రైతులకు అవగాహన కల్పించాలి

పెనుమంట్ర : దాళ్వా సమీపిస్తున్న తరుణంలో నారుమడి, కలుపు యాజమాన్యం అంశాలపై రైతాంగానికి అవగాహన కల్పించాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ జి.జోగినాయుడు అన్నారు. సంస్థలో శనివారం ఎఒ, ఎఇఒలకు శిక్షణ, వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవి.కృష్ణాజి వ్యవహరించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కూలి రేట్లు పెరిగిన కారణంగా డ్రోన్ పరిజ్ఞానాన్ని రైతుల చెంతకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని ఉద్దేశంతో ప్రతి జిల్లాకు ఒక విస్తరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ కెఎం దక్షిణామూర్తి, డాక్టర్ ఎ.ఆనంద్‌కుమార్, డాక్టర్ ఎన్.వెరోనిక, డాక్టర్ ఎం.రామభద్రరాజు, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండి

పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యండగండి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామానికి చెందిన బక్కపాటి శ్రీనివాసరావు(47) ఉపాధి నిమిత్తం యండగండిలోని తన బావమరిది ముంగండ రామకృష్ణ వద్ద వడ్రంగి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో షాపులోని చెక్కలు తీస్తుండగా ఎడమ చేతి మణికట్టు వద్ద పాము కాటు వేసింది. దీంతో అతడిని స్థానికులు యండగండిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం భీమవరం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసరావు మరణించినట్లు ధ్రువీకరించారు. తన బావమరిది ముంగండ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎఎస్ఐ అడబాల శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు బోల్తా

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం వైపు నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి మురుగు బోదెలో పడిన ఘటన శనివారం సాయంత్రం శృంగవృక్షం గ్రామంలో చోటు చేసుకుంది. పాలకొల్లు వైపు వెళ్తున్న కారు శృంగవృక్షం రైల్వే గేటు వద్దకు చేరుకునే సరికి చోదకుడు గేటు మరమ్మతులు చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్నారు. ఈ క్రమంలో కారును వెనక్కి తిప్పేందుకు ప్రయత్నించగా గేటు సమీపంలోని మురుగు బోదెలోకి కారు అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి, డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చైతన్యానికి ప్రతిరూపం అల్లూరు మూర్తిరాజు

నేడు ప్రథమ సంస్మరణ



అల్లూరు మూర్తిరాజు జీవితం అందరికీ ఆదర్శం. ఆయన స్వస్థలం ప్రస్తుతం కోనసీమ అంబేద్కర్ జిల్లాలోని సఖినేటిపల్లి. ఆయన తండ్రి అల్లూరు రామరాజు. అయితే ఆయనను అందరూ అప్పనపల్లి రామరాజు అంటారు. మూర్తిరాజు పెద్దతమ్ముడు ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ నాయకులు అల్లూరు సత్యనారాయణరాజు. మూర్తిరాజుకు ఇద్దరు సోదరీమణులు, నలుగురు సోదరులు. పెద్ద కొడుకైన మూర్తిరాజు చిన్నవయసులోనే తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటూ చదువుకున్నారు. అల్లూరు సత్యనారాయణ కమ్యూనిస్టు నేతగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తూ ఆర్థికంగానూ ఎంతో తోడ్పాటునందించారు. మూర్తిరాజుకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇటు తల్లిదండ్రులు, సోదరులు నలుగురు, ఒక సోదరి చనిపోయినా తమ్ముళ్ల పిల్లలందరికీ పెద్ద దిక్కుగా నిలిచి అండగా ఆదుకున్నారు. మూర్తిరాజుకు మూఢనమ్మకాలు లేవు. పూజలు చేసేవారు కాదు. ఎప్పుడూ మెడిటేషన్ చేసేవారు. జేబులో ఒక రూపాయి కూడా ఉంచుకునేవారు కాదు. నిస్వార్థ త్యాగధనుడు మూర్తిరాజు. తమ్ముడు అల్లూరు సత్యనారాయణ పార్టీ బాధ్యతలతో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 30 సంవత్సరాలు నివశించిన కాలంలో మూర్తిరాజు సఖినేటిపల్లి నుంచి ప్రతినెలా వచ్చి తమ్ముడు ఆర్థిక విషయాలు వగైరా, అవసరాలు తెలుసుకుని బియ్యం, వంట సరుకులు పాలకొల్లు చేర్చేవారు. ఆ తండ్రీకొడుకుల ఆదరణతోనే అల్లూరు సత్యనారాయణ ఏ ఇబ్బందులూ లేకుండా బాధ్యతల రీత్యా 1994లో హైదరాబాద్ రాగలిగారు. ఆ అన్నదమ్ముల అనుబంధం ఎనలేనిది. అల్లూరు సత్యనారాయణ 2014 జులై నాలుగో తేదీన కన్నుమూసిన సమయంలో మూర్తిరాజు మౌనంగా కూర్చుండిపోయారు. చివరకు 96 సంవత్సరాల వయస్సులో మూర్తిరాజు 2021 డిసెంబర్ 18న కన్నుమూశారు. తండ్రికి వారసులుగా వారి బిడ్డలు ధన్యులు. నిరంతరం వారి స్మృతులతో..

-అల్లూరు మన్మోహిని

ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక సంఘం కార్యాలయంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ అధ్యక్షులు ఎన్ఎస్ఎస్.పాల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్ నకారా, వైవి.చంద్రచూడ్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సంఘం కార్యదర్శి సీతారామరాజు మాట్లాడుతూ 1982లో నకారా న్యాయ పోరాటంతో ఆనాటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ తీర్పునిస్తూ పెన్షన్ అనేది యజమాని తన ఇష్టాన్ని బట్టి, దయా దాక్షిణ్యాలను బట్టి చేసే దానం కాదని అది ఒక సామాజిక సంక్షేమ చర్య అని స్పష్టమైన తీర్పునిచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఖజానాధికారి రవివర్మ, ట్రెజరరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పాండురంగారావు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్‌పెద్ద సంఖ్యలో పెన్షనర్స్ పాల్గొన్నారు. అనంతరం సీనియర్ పెన్షనర్స్ ఎన్ఎస్ మిలాంగ్టన్, ఐఎస్ఎన్ రాజు, డి.సీతాపతిరాజు, వివి.పద్మావతిలను ఘనంగా సత్కరించారు.

ఉండి : ప్రతి పెన్షనర్ ప్రశాంతమైన జీవనం గడపాలని గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లూరి గాంధీబాబురాజు అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా ఉండిలో శనివారం నిర్వహించిన సభకు ఆకివీడు ఉండి యూనిట్ ఉపాధ్యక్షులు ముదునూరి గోపాలరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గాంధీబాబు రాజు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన ప్రభుత్వం పింఛను ఇవ్వాలని కోరారు.

రాష్ట్రానికి హోదా ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 15, 16 తేదీల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర మహాసభ కాకినాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందని మహాసభలో సుదీర్ఘంగా చర్చలు జరిపి ప్రత్యేక హోదా కోసం రాష్ట్రంలోను, ఢిల్లీలోనూ నిరసన పోరాటాలు చేసేందుకు నిర్ణయిస్తామని తెలిపారు. అన్ని పార్టీలు ఐక్యపోరాటం చేసి ప్రత్యేక హోదా సాధించుకుందామని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబానికి దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కాళ్ల

ఆర్థిక సాయం చేస్తున్న వేగేశ్న విజయరామరాజు

కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ పేద ప్రజలకు విశేష సేవలకు అందిస్తుందని వైసిపి నాయకులు వేగేశ్న విజయరామరాజు అన్నారు. కాళ్లకూరు వెంకటాపురంలో లావేటి కన్నంనాయుడు ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైసిపి నాయకులు వేగేశ్న విజయరామరాజు శనివారం పరామర్శిం చారు. లావేటి కన్నంనాయుడుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు తన వంతు సాయంగా రూ.ఆరు వేల నగదును వేగేశ్న విజయరామరాజు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కేంగం పెద్దిరాజు, అవురి గౌరీనాయుడు, అవురి సోమేశ్వరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీశశి హైస్కూలులో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి రాజుల పేటలోని శ్రీ శశి ఇంగ్లీష్ మీడియం హై స్కూలులో సెమీ క్రిస్మస్ వేడుకలు స్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు, నాగమణి ఆధ్వర్యంలో స్కూల్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిస్మస్ కేక్ కట్ చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకు న్నారు. స్కూలు విద్యార్థులు వివిధ వేషధారణలతో నాటకాలు ప్రదర్శించి, క్రిస్మస్ గీతాలు ఆలపించి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తణుకు రూరల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తణుకు కోర్టు పరిధిలో ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కారం వల్ల ఇరు పార్టీలకు సత్వర న్యాయం, సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు ఈ జాతీయ లోక్‌అదాలత్ గురించి అవగాహన కల్పించేవిధంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.బాబు, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎవి.నాగరాజు, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ పిఎస్.చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సుధాకరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : 2023 ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో తాడేపల్లిగూడెం, గణపవరం, చేబ్రోలు, పెంటపాడు, నల్లజర్ల, అనంతపల్లి పరిధిలోని సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన కక్షి దారులు కేసులను రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకర్ల సమవేవంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక న్యాయ సేవలందించేందుకు వీలుగా మార్చి 18వ తేదీ, జూలై 29, సెప్టెంబర్ 21 తేదీల్లో కూడా ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామన్నారు. వినియోగదారుల కేసులు మేథో సంపత్తికి సంబంధించిన కేసులు, ఇతర కేసుల పరిష్కారం చూపుతామని వెల్లడించారు. ఇరు కుటుంబాలు నష్టపోకుండా ఉండేందుకు రాజీయే రాజమార్గమని కక్షిదారులు అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు నాగమల్లేశ్వరి, రమ్య, అరుంధతి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : 2022లో జరిగిన నాలుగు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 832 ఆయా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్ మనోవర్తి కేసులను, 1112 ప్రీ లిటిగేషన్ కేసులను ఉభయ పార్టీల సమక్షంలో రాజీ చేయడంలో మీడియా ప్రభావం ఎంతగానో ఉందని భీమవరం సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. శనివారం భీమవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కూడా ఎక్కువ కేసులు రాజీ చేయడానికి అందరు సహకరించాలని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సోని, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌వి.సత్యనారాయణ, న్యాయవాదులు ఎం.శివకృష్ణ, పి.అంబేద్కర్ పాల్గొన్నారు.

పాలకొల్లు : ఫిబ్రవరి 11న పాలకొల్లు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పాలకొల్లు అదనపు సీనియర్ సివిల్ జడ్జి భానుసాయి చెప్పారు. కక్షిదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, రాజమహేంద్రవరం వారి కోర్టులో
I.A. 8/2021, O.S. 13/2021
Between:
వల్లెం శ్రీ తనూజ
నాగదుర్గా సుధీర్
రాజమహేంద్రవరం
తూర్పుగోదావరి జిల్లా -పిటీషనర్/వాది
AND
హరి లలిత రత్నకుమారి, W/o. విశ్వేశ్వర శాస్త్రి, డో.నెం. 8-167, రేలంగి గ్రామం, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
-రెస్పాండెంట్/ప్రతివాది
ప్రకటన
పై తెలిపిన పిటీషనర్ ప్రోనోటు బాకీ నిమిత్తం పై కోర్టులో దాఖలు చేసిన దావాలో మీ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ జప్తు చేయమని పిటిషన్ దాఖలు చేసినారు. సదరు పిటిషన్‌లో మీకు ఎన్నిసార్లు సమనులు పంపుతున్న తీసుకొనక ఉద్దేశపూర్వకంగా త్రిప్పి పంపుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం మీకు తెలియచేయునది ఏమనగా, ది. 20-12-2022వ తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల సదరు పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానించబడును అని తెలియచేయబడును.
బి.వి.రామణారావు
యస్.మణికంఠ
న్యాయవాదులు, రాజమహేంద్రవరం

ఏలూరుపాడులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ టిడిపికి మద్దతు పలకాలని ఆ పార్టీ ఏలూరుపాడు గ్రామ అధ్యక్షులు మంతెన ఆంజనేయరాజు కోరారు. మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆంజనేయరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలు ఎలాంటి కష్టాలు పడుతున్నారో గ్రామల్లో తిరుగుతుంటే తెలుస్తుందన్నారు. కేవలం అరకొర సంక్షేమ పథకాలు చూసి ప్రజలు మోసపోవద్దని, రాష్ట్రం ఎలా నాశనం అవుతుందో గమనించాలన్నారు. గ్రామల్లో గతంలో జరిగిన అభివృద్ధి అంతా టిడిపి వల్లే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు వక్కపట్ల హరిబాబు, కార్యదర్శి సత్యనారాయణ, యాళ్ల చిట్టిబాబు, సుదాబత్తుల వంశీ, దాట్ల శ్రీనివాస్‌వర్మ, వార్డుసభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకుమారి ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళల హక్కుల, చట్టాల సాధనకు జీవితాంతం కృషి చేసిన మహిళా ఉద్యమనేత రాజకుమారి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎపి మహిళా సమాఖ్య పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి కోరారు. మహిళా సమాఖ్య నాయకురాలు చంద్ర రాజకుమారి నాలుగో వర్ధంతి సందర్భంగా శనివారం భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చంద్ర రాజకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు బి.అరుణ, నవీన, సీత, నూకాలమ్మ, జ్యోతిర్మయి, నర్గీస్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఈ నెల 18 తేదీ వరకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను భీమవం పట్టణంలో నిర్వహించుచున్నారు. పట్టణంలో 20వ వార్డు పరిధిలో ప్రత్యేక అధికారి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, వాలంటీర్లు, ఎస్‌హెచ్‌జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలిమ, భరత, రామకృష్ణ, హోప్ ఎవాంజెలిన్ పాల్గొన్నారు.

పాతపాడులో హౌసింగ్ డే

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్న లేఅవుట్ల గృహ నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని అధికారులకు ఆ శాఖ ప్రత్యేక అధికారి ఎపిడి వి.విజయలక్ష్మి సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని పాతపాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా జగనన్న లే అవుట్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కాళీపట్నం పడమరలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమెతో పాటు సర్పంచి కొప్పాడి లక్ష్మీతులసి ఉమామహేశ్వరరావు, కవురు సావిత్రి ఆదినారాయణ, ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, ఎపిఒ వై.శ్రీనివాస్, హౌసింగ్ ఎఇ ఫణీంద్ర పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - మొగల్తూరు

నియోజకవర్గంలో శుద్ధి జలాలకు రూ.45 కోట్లు వెచ్చించామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లిలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.పది లక్షలతో నిర్మించనున్న చేపల మార్కెట్ నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత భవన మరమ్మతులకు రూ.ఐదు లక్షల నిధులు మంజూరు చేశామని చెప్పారు. ప్రసాద్ రాజు దృష్టికి చింతరేవు గ్రామస్తులు తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోపనాతి పుల్లయ్య, నాయకులు రేవు రాంబాబు, బంధన పూర్ణచంద్రరావు, బర్రె సామ్రు, కుక్కల కృష్ణమోహన్, కడలి మధుసూదన్, కర్రీ ఏసుబాబు, గుబ్బల నారాయణమూర్తి పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని పెనుగొండ పరిధి గుబ్బలవారివీధిలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు ఉన్నవారు ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, జెడ్‌పిటిసి సభ్యులు పోడూరు గోవర్ధన్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 53/2021
in O.S No: 14/2021
పిటీషనర్లు /వాద్లు:
Manthena Appala Raju & 2 Others
రెస్పాండెంట్లు /ప్రతివాద్లు:
M/s Ramji BuildersHyderabad Partnership firm Rep. by it's Managing Partner Dantuluri Venkata Viswanadha Varma and 3 others
3వ రెస్పాండెంటు అడ్రస్సు:
Bokka Anil Prakash S/o Surya Prakash Rao aged 42 years, D.no:8-10, R/o Srungavruksham, Palakoderu Mandalam, West Godavari District.
పై నెంబరు దావాలో 3వ రెస్పాండెంటుకు కోర్ట్ ద్వారా, పోస్టు ద్వారా నోటీసులు ఎన్ని పర్యాయములు పంపించినప్పటికి ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక Avoid చేయుచున్నారు. సదరు 3వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.30-12-2022 సం॥తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్ట్ వారి ఎదుట స్వయముగ గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల 3వ రెస్పాండెంటు పరోక్షములో ఈ పిటీషను తీర్మానించబడును.
R. PADMANABHA RAJU
ADVOCATE, VISSAKODERU
Ph: 08816-232006, Cell:9849635172

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S No: 14/2021
వాదులు:
Manthena Appala Raju & 2 Others
ప్రతివాదులు:
M/s Ramji Builders Hyderabad Partnership firm Rep. by it's Managing Partner Dantuluri Venkata Viswanadha Varma and 3 others
3వ ప్రతివాది అడ్రస్సు:
Bokka Anil Prakash, S/o Surya Prakash Rao aged 42 years, D.no:8-10, R/o Srungavruksham, Palakoderu Mandalam, West Godavari District.
పై నెంబరు దావాలో 3వ ప్రతివాదికి కోర్ట్ ద్వారా, పోస్టు ద్వారా దావాసమన్లు ఎన్ని పర్యాయములు పంపించినప్పటికి ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక Avoid చేయుచున్నారు. సదరు 3వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.30-12-2022 సం॥తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా ఉదయం 10:30 గంటలకు పై కోర్ట్ వారి ఎదుట స్వయముగ గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల 3వ ప్రతివాది పరోక్షములో ఈ దావా తీర్మాణించబడును.
R. PADMANABHA RAJU
ADVOCATE, VISSAKODERU
Ph: 08816-232006, Cell:9849635172

నేడు పొలమూరులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

పెనుమంట్ర : మండలంలోని పొలమూరులో ఈ నెల 18వ తేదీ ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు పాల్గొంటారని తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది
ఏలూరు జిల్లా, ఉంగుటూరు గ్రామానికి చెందిన గుల్ల తంబి, తండ్రి: గుల్ల పెద్దలు అను నేను ఉంగుటూరు నుండి నారాయణపురం ఆటోలో వెళ్ళుచుండగా మార్గ మధ్యలో **N7193704 నంబరు గల పాస్‌పోర్టు పోయినది** దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
గుత్తికొండ శ్రీనివాసరావు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 98480 50089

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 1233/2022
ఇన్ ఓ.ఎస్.నెం. 173/2017
బిట్వీన్:
శ్రీ ముత్యాల రాంబాబు ...వాది
మరియు
1) శ్రీమతి కేత భూవమ్మ (డైడ్)
2) శ్రీమతి పంపన్న నాగలక్ష్మి మరియు 3 వగైరాలు ...ప్రతివాదులు
5వ ప్రతివాది /ప్రపోజల్ పార్టీ:
శ్రీ కేత శ్రీను, తండ్రి: లేటు వెంకటేశులు, ఇంటి నెం.2-77, మీనవల్లూరు గ్రామం, పెంటపాడు మండలం, ప॥గో॥జిల్లా.
పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు ద్వారా ప్రపోజల్ పార్టీ అయిన 5వ ప్రతివాదికి శ్రీ కోర్టు ద్వారా పంపించిన సమన్లు అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారం **ది.23-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను.** లేనిఎడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును. ఇందుమూలముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం తెలియజేయడమైనది.
అద్దంకి విజయ రత్నం
వాది తరుపున అడ్వకేట్,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
16-12-2022. సెల్: 92901 88928

మహారాజశ్రీ చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No: 218/2019
వాది: మల్లువలస మావుళ్ళు వగైరా
ప్రతివాదులు:
కోటికలపూడి గోపాల కృష్ణ కుమారి వగైరా
మొదటి ప్రతివాది:
కోటికలపూడి గోపాల కృష్ణ కుమారి, భర్త: లేట్ గోపాల కృష్ణ కిషోర్, డో.నెం. 7-5-0, తిరుమల అపార్టుమెంటు వద్ద, నరసయ్య అగ్రహారం, భీమవరం- 3, ప॥గో॥జిల్లా.
రెండవ ప్రతివాది:
కోటికలపూడి సంతోషి, తండ్రి: లేట్ గోపాల కృష్ణ కిషోర్, డో.నెం. 7-5-0, తిరుమల అపార్టుమెంటు వద్ద, నరసయ్య అగ్రహారం, భీమవరం-3, ప॥గో॥జిల్లా.
మూడవ ప్రతివాది:
కోటికలపూడి శ్రీరామ్, తండ్రి: లేట్ గోపాల కృష్ణ కిషోర్, డో.నెం. 7-5-0, తిరుమల అపార్టుమెంటు వద్ద, నరసయ్య అగ్రహారం, భీమవరం-3, ప॥గో॥జిల్లా.
పై నెంబరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు **ది.23-12-2022 సం॥రం॥ తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగ గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పరచుకొనవలెను.** అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
కె.వి.రమేష్,
భీమవరం, వాది తరపు న్యాయవాది.
16-12-22. పెన్నాడ.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
ఇ.పి.నెం. 40/2022
ఓ.ఎస్.నెం. 65/2018
మధ్య:
సత్తి ధనవీర వెంకటలక్ష్మి, భర్త: రామిరెడ్డి, హిందూ, స్త్రీ, వయస్సు 40 సం॥లు, గృహిణి, డో.నెం. 3-161/సి, ఆల్ఫా స్కూలు రోడ్డు, నెగ్గిపూడి, పెనుమంట్ర మండలం.
TNK SCJC ...D.H.R
VS
ముమ్మిడి ఏసు, తండ్రి: సత్యనారాయణ, హిందూ, మేల్, వయస్సు 41 సం॥లు, వ్యాపారం, డో.నెం. 2-13-87, వెంకట్రామన్నగూడెం, తాడేపల్లి గూడెం మండలం.
TPG SCJC ...J.D.R
డి.హెచ్.ఆర్. తరపు వేలము ప్రకటన కోర్టు ఉత్తర్వులు ప్రకారం
పై నెంబరు ఇ.పి.40/2022 ఇన్ ఓ.ఎస్.65/2018 పై కోర్టు వారి నందు సదరు ఇ.పి. షెడ్యూలు అనగా ఈ క్రింది స్థిరాస్థిని డి.హెచ్.ఆర్. డిక్రీ బాకీ రాబట్టుట కొరకు శ్రీ కోర్టు వారు **ది.04-01-2023 తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలము వేయుదురు.** కావున యావన్మంది సదరు వేలములో పాల్గొని షెడ్యూలు ఆస్థిని పాడుకోవాల్సిందిగా కోరుచున్నాము.
షెడ్యూలు ఆస్థి వివరం
పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్టార్, జగ్గన్నపేట గ్రామం ఆర్.ఎస్.నెం. 123/6ఎ లో సెంట్లలో ఎ.0-49 సెం॥ మరియు ఆర్.ఎస్.నెం. 123/6డి లో ఎ.0-6సెంట్లు మొత్తం ఎ.0-55 సెంట్లు ఈ క్రింది హద్దుల మధ్య:
తూర్పు: కాలువ.
దక్షిణం: రెడ్డి సత్తిరెడ్డి గారి స్థలం.
పడమర: పత్సా సోమన్న గారి భూమి.
ఉత్తరం: నీలపాల పెద్దిరాజు గార భూమి.
పై తెల్పిన హద్దుల మధ్య ఎ.0-55 సెంట్లు వ్యవసాయ భూమి యావత్తు ఈజుమెంటు హక్కులతో సహాయ్ను.
డి.హెచ్.ఆర్.విలువ : రూ.6,00,000/-
సబ్‌రిజిస్ట్రార్ విలువ : రూ.5,50,000/-
శిరిగినీడి విజయకృష్ణ
ఏపీపీ, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.